క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 లక్షల వితరణ



పెనమలూరు: పోరంకి గ్రామంలో పునర్నిర్మిస్తున్న శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీకోదండరామాలయానికి ఇద్దరు దాతలు విరాళం అందజేశారు. పోరంకి గ్రామానికి చెందిన కంచర్ల రామకోటేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య విమాలాదేవి రూ.1,00,017 చెక్కు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే అక్కి వెంకట జిలువేశ్వరచార్యులు జ్ఞాపకార్థం ఆయన కుమారులు అక్కి శేషుబాబు, శ్రీనివాసరావు రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు.

విజేతలకు బహుమతులు



ఉయ్యూరు: పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్య సామర్థ్యం వెలుగులోకి వస్తుందని విశ్రాంత ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. స్థానిక ఏజీ అండ్ ఎస్‌జీ సిద్దార్థ కళాశాల సెమినార్ హాలులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ, ఎంఈసీ విద్యార్థులకు బుధవారం వాణిజ్య శాస్త్రంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు చంద్రశేఖర్‌రావు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమకు ఉన్న ప్రతిభ ఆధారంగా ఎంచుకున్న రంగంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎం.రాఘవేంద్రప్రసాద్, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ఎస్.వసంతరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు అధిక ఫీజు వసూళ్లు నిలిపివేయాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అధిక ఫీజుల వసూళ్లు నిలిపివేయాలని నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. ఇటీవల ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ పెంచిన నేపథ్యంలో కానుమోలు సబ్ రిజిస్ట్రార్ డి.జయరాజు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ హాల్‌లో జరిగిన ఈ సదస్సులో ఆళ్ల మాట్లాడుతూ సేల్ డీడ్ రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మార్కెట్ విలువలో 7.5 శాతం కాగా, కానుమోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 9 శాతం వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ జయరాజు స్పందిస్తూ భవిష్యత్‌లో ఇలాంటి ఆక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, స్టాంపు వెండర్లు, దస్తావేజు లేఖర్లు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు



ఉయ్యూరు: నిబద్ధతతో చేసే పనికి ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ఉత్తమ సేవలకు అవార్డు పొందిన ఈఈ కృష్ణనాయక్‌ను బుధవారం గండిగుంట సబ్‌స్టేషన్ పరిధిలోని సిబ్బంది సత్కరించి జ్ఞాపకను అందజేశారు.ఈఈ కృష్ణనాయక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. ఏ స్థాయిలో అధికారి, ఉద్యోగి అయి నా సరేఅంకితభావంతో పనిచేయాలన్నారు. సిబ్బంది సుబ్రమణ్యం, జగదీష్, ఆంజనేయులు, విజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత శస్త్రచికిత్సలు



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్దార్థ దంత వైద్యకళాశాలలో నోరు, ముఖము, దవడ ఎముకల శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ రామోజీరావు తెలిపారు. బుధవారం మాట్లాడుతూ అంతర్జాతీయ నోరు, ముఖము, దవడ ఎముకల శస్త్ర చికిత్స వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వివరించారు. దంతాలకు అన్ని విభాగాల్లో ఉచిత శస్త్రచికిత్సలు, ఉచితంగా దంతాలు తొలగిస్తామన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఉంగుటూరు: మద్యం వ్యసనం మానలేకపోతున్నాన్న మనస్థాపంతో ఎలుకల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మానికొండ గ్రామానికి చెందిన షేక్ మునీర్ (25) తాపీ పని చేస్తుంటాడు. అవివాహితుడు. జనవరి 31న ఎలుకల మందు పేస్టు కొనుగోలు చేసి నీటిలో కలుపుకొని తాగాడు. అదే రోజు రాత్రి 12 గంటలకు వాంతులు చేసుకోవడంతో మునీర్‌ను అతని సోదరుడు గఫూర్ విజయవాడలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవిందు తెలిపారు.

వదలని గుర్రపుడెక్క.. కదలని నీరు

- అధ్వానంగా ఏలూరు కాలువ
- గత వరదల్లో బలహీనపడిన గట్లు
- కాలువ నిర్వహణ పనులు మరిచిన అధికారులు
- అధికారుల తీరుపై రైతుల ఆవేదన
- 1.15 లక్షల ఎకరాలకు సాగునీరు, 86 చెరువులకు తాగునీటికి ఆధారం



తేలప్రోలు వద్ద ఏలూరు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

గన్నవరం: నియోజకవర్గంలోని ప్రధాన సాగునీటి వనరైన ఏలూరు కాలువ నిర్వహణ అధ్వానంగా తయారైంది. కాలువలో భారీగా గుర్రపు డెక్క పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. కాలువ గట్లు సైతం ముళ్లకంచెలు, పిచ్చిమొక్కలతో నిండిపోయి బలహీనంగా మారాయి. గత కొన్నేళ్లుగా కాలువ నిర్వహణ విషయంలో ఇరిగేషన్ శాఖ అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగా ఈ పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఫలితంగా ఇటీవల సంభవించిన వరదలకు పలుచోట్ల బలహీనంగా ఉన్న కాలువ గట్లకు గండ్లు పడి వందలాది ఎకరాలు ముంపునకు గురై పంట నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువ ప్రాధాన్యత ఇదీ..

ఏలూరు కాలువ ప్రకాశం బ్యారేజ్ నుంచి ప్రారంభమై విజయవాడ, గన్నవరం నియోజకవర్గం మీదుగా ఏలూరు వరకు సుమారు 65 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. సుమారు 1,600 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం కలిగిన ఈ కాలువ కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 1.15 లక్షల ఎకరాలకు సాగునీరు, 86 చెరువులకు తాగునీటిని అందిస్తుంది. గన్నవరం నియోజకవర్గంలోని డెల్టా గ్రామాలకు ఇదే ఏకైక నీటి వనరు.

కనిపించని పురోగతి..

గత కొన్నేళ్లుగా ఏలూరు కాలువ నిర్వహణలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఏటా ఖరీఫ్ సీజన్ మధ్యలో కాలువను కట్టేసి గుర్రపు డెక్క, నాచు తొలగింపు పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టేవారు. వ్యవసాయ సీజన్లకు నీరు అందించే ప్రక్రియ ముగిసిన తర్వాత కాలువలోని వ్యర్థాలను తొలగించడం, గట్టులను బలపరిచే పనులు చేయడం అనవాయితీగా వస్తోంది.

శ్రద్ధచూపని అధికారులు..

అయితే కొంత కాలంగా కాలువ నిర్వహణపై అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని రైతులు పేర్కొంటున్నారు. వేసవి అవసరాలకు అనుగుణంగా ఏలూరు కాలువ ద్వారా మంచినీటి చెరువులను నింపేందుకు త్వరలో నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో కాల్వ నిండా గుర్రపు డెక్క దట్టంగా అల్లుకుపోవడంతో నీటి ప్రవాహనికి అడ్డంకిగా మారింది. దీనివల్ల తాగునీటి చెరువులను నింపడం కష్టతరంగా మారుతుంది. దీనికితోడు కాలువలో భారీగా వ్యర్థాలు కలవడం వల్ల నీరు కలుషితమవుతోందని పరిసర గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

అధికారులకు రైతుల వినతి..

ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కాలువ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నారు. కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించడంతో పాటు రానున్న వేసవిలోనైనా బలహీనంగా ఉన్న కాలువ గట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గట్లను బలోపేతం చేయాలి..



దశాబ్ద కాలంగా ఏలూరు కాలువ నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా కాలువ గట్లు బలహీనంగా మారాయి. ఇటీవల వరదలకు కేసరపల్లి వద్ద గట్టు తెగి వందలాది ఎకరాల వరి పొలాలు ముంపు బారినపడ్డాయి. దీనివల్ల చేతికి వచ్చిన పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయాం. ఇప్పటికైనా ఇరిగేషన్, సాగునీటి సంఘాలు స్పందించి కాలువ గట్టు బలోపేతానికి చర్యలు తీసుకోవాలి.

– మేడూరి పుష్పనాథం, రైతు, కేసరపల్లి

కాలువలపై దృష్టి పెట్టాలి..



ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాలో లక్షలాది ఎకరాల పంట పొలాలకు, వందలాది గ్రామాలకు సాగు, తాగునీరు అందిస్తున్న ఏలూరు కాలువ నిర్వహణపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు. గతంలోలా ప్రతి వేసవిలో కాలువ కట్టివేసిన తర్వాత నిర్వహణ పనులు చేపట్టాలి. కాలువలోని చెత్తాచెదారం తొలగించి, గట్లను బలోపేతం చేయాలి. కాలువ నీరు కలుషితం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– సూరగాని సాంబశివరావు, రైతు సంఘ నాయకులు, గన్నవరం

దివ్యాంగ పింఛన్‌దారులకు మళ్లీ వైద్య పరీక్షలు

12వ తేదీ నుంచి ప్రారంభం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో దివ్యాంగ పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు తిరిగి వైద్య పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశించింది. కంటి చూపు సమస్యతో గతంలో సదరం నుంచి సర్టిఫికెట్ తీసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 12వ తేదీ నుంచి తిరిగి వైద్య పరీక్షలు చేస్తారు. లబ్ధిదారుడు నిజంగా కంటి సమస్యతో బాధపడుతున్నారా లేదా అనే విషయం మరలా వైద్యులు ధ్రువీకరించాల్సి ఉంది. కంటి చూపుతో బాధపడుతున్న 137 మందికి ఈ నెల 12,17,19 తేదీల్లో గుడివాడ ఆస్పత్రిలో వైద్య పరీక్ష చేస్తారు. ఈఎన్‌టీ వైద్య పరీక్షలు ఏప్రిల్ 8, 9,15 తేదీల్లో మచిలీపట్నం జనరల్ ఆస్పత్రిలో వైద్యులు 190 మందికి పరీక్ష చేస్తారు. మానసిక వ్యాధితో బాధపడుతూ పింఛన్ పొందుతున్న 268 మందికి ఏప్రిల్ 15వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తారు. వైద్య పరీక్షల్లో అంగవైకల్యం ఉన్నట్లు వైద్యులు గుర్తించి సర్టిఫికెట్ ఇస్తేనే లబ్ధిదారులకు పింఛన్ కొనసాగుతుంది. కాగా ప్రభుత్వం తిరిగి వైద్య పరీక్షలకు ఆదేశించటంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమ పింఛన్లు తొలగిస్తుందేమోనని భయపడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గ్రామంలో గురువారం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా పోరంకి సెంటర్, ప్రభునగర్, శ్రీనగర్, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

ముగిసిన ఎడ్యు ఫెయిర్



ప్రాజెక్టులను ఆసక్తిగా చూస్తున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: విద్యార్థుల ప్రగతికి క్రమశిక్షణ, ప్రతిభ గీటురాయి అని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్ అన్నారు. బుధవారం ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో ఎడ్యు ఫెయిర్ రెండవ రోజు ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. పర్యావరణానికి మేలు చేసే విధంగా రేపటి తరం విద్యార్థులు ఈనాడే అవగాహనతో రూపొందించిన ప్రాజెక్టులు వారి మేధో సంపత్తికి ఉదాహరణగా కొనియాడారు. రంగుల ఆహారాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై నమూనాలు, తినే రోజువారి భోజనంలో విటమిన్స్ ప్రాధాన్యత ఆకట్టుకున్నాయన్నారు. సర్వమానవ ఐకమత్యాన్ని ప్రతిబింబిస్తూ విద్యార్థులు అయోధ్య రామమందిరం, మక్కా, చర్చి, గౌతమబుద్ధుని ఆదర్శజీవనం, దేశభక్తుల గాథలు ఈ ఎగ్జిబిషన్ ప్రతిబింబించిందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీర సుల్తానా, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఎంతగానో తీర్చిదిద్దారన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, అనుమాటి చెన్నయ్య, సుధాకర్, ముస్తాబాద వెల్ఫేర్ అసిస్టెంట్ జెట్టి నానారావు, పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమాం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు జాతీయ స్థాయిలో ఏఐ హ్యాకథాన్

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో గురువారం జాతీయ స్థాయిలో ఏఐ హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో జాతీయ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా దాదాపు 1,300 మంది ప్రతిభ కలిగిన విద్యార్థులు వివిధ కాలేజీల నుంచి పాల్గొంటారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొంటారు. ఏఐ టెక్నాలజీతో నటరత్న నందమూరి తారక రామారావు ప్రసంగం ఉంటుంది.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి బీజేఆర్‌నగర్‌కు చెందిన నల్లమోతు కోటేశ్వరరావు (జాన్) తాడిగడప జంక్షన్‌లో టీ తాగుతున్న సమయంలో ఎన్.వసంతరావు, ఆయన కుమారుడు మను అకారణంగా దాడి చేశారు. ఈ ఘటనలో కోటేశ్వరరావుకు గాయాలు అయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కరపత్రాల ప్రచారం.. ముగ్గురిపై కేసు

పెనమలూరు: మండల పరిధిలో కరపత్రాలతో కలకలం రేపి, ఓ వ్యక్తిపై దౌర్జన్యం చేసిన ముగ్గురిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకిలో మంగళవారం చట్ట విరుద్ధంగా కరపత్రాలు ముద్రించి జ్ఞానేంద్ర, సురేష్, అనూష బహిరంగ ప్రదేశాల్లో వేశారు. ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. అలాగే పై వ్యక్తులు బి.అబ్రహం అనే వ్యక్తి ఇంటికి వెళ్లి గొడవ పెట్టుకుని దౌర్జన్యం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేసవికి సిద్ధమవుతున్న పేదవాడి ఫ్రిజ్‌లు

నున్న గ్రామంలో మట్టి కుండల తయారీ



నున్నలో ఆరబెట్టిన మట్టి కుండలు

నున్న(విజయవాడరూరల్): ఎండలు మండిపోతున్న నేపథ్యంలో పేదవాడి ఫ్రిజ్‌లు సిద్ధమవుతున్నాయి. పేదవాడి ఫ్రిజ్‌లుగా పిలుచుకునే మట్టికుండలు నున్న గ్రామంలో అమ్మకాలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ వెల్లడించటంతో మట్టిపిసికి కుండలను తయారు చేసేందుకు శాలివాహనులు రాత్రింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారు. సహజంగా ఎండల్లో చల్లటి నీరు తాగాలని ప్రజలు ఇష్టపడుతుంటారు. అది కూడా మట్టితో తయారు చేసిన కుండలో నీరు తాగితే ఆరోగ్యానికి మంచిదనే ఉద్దేశంతో కుండలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఎండాకాలం సీజన్ ప్రారంభమవుతుందనగానే విజయవాడ రూరల్ మండలం నున్న, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లోని శాలివాహనులు మట్టి కుండలు, మట్టి ప్లాస్కోలు, కూజాలు తయారు చేయారు చేసేందుకు ఇంటిల్లిపాదీ పనిచేస్తుంటారు. రెండు గ్రామాల్లో సుమారు 300 కుటుంబాల వారు ఈ పనిలో నిమగ్నమవుతుంటారు. ఇందుకు నెల రోజులు ముందు నుంచే మట్టిని సేకరించుకోవడం, నానాబెట్టి పిసుక్కోవడం, కుండలు తయారు చేయడానికి అనువుగా మట్టి జిగురువచ్చేలా చేసి ఆ మట్టిని సారెపై వేసి చిన్న కుండలు, పెద్ద కుండలు తయారు చేస్తుంటారు. 20 లీటర్ల కుండ రూ.150 చొప్పున ఇళ్ల వెంట గంపలో పెట్టుకొని అమ్ముతారు. చలివేంద్రాల్లో పెట్టుకునే కుండలైతే సైజును బట్టి రూ.500 వరకు అమ్మే అవకాశా లుంటాయని తెలిపారు. కుండలు తయారు చేసే ఇద్దరు, ముగ్గురు కలిసి కుండలను విజయవాడ, జగ్గయ్యపేట, కోదాడ, లాంటి దూరప్రాంతాలకు తీసుకెళ్లి విక్రస్తారు. అయితే కరెంటు ఫ్రీజ్‌లు, కూలర్లు కూలింగ్ ఫ్లాస్కులు మార్కెట్లోకి రంగప్రవేశం చేయడంతో మట్టి కుండల వ్యాపారం కొంచెం కష్టంగా మారిందని చెబుతున్నారు.

అట్లూరికి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నివాళి



రామకృష్ణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: తెన్నేరు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త అట్లూరి రామకృష్ణ మృతి బాధాకరమని వక్తలు పేర్కొన్నారు. రామకృష్ణ (58) కానూరులో మంగళవారం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన తెన్నేరు తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి బుధవారం గ్రామానికి వెళ్లి రామకృష్ణ భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, సర్పంచ్‌లు జుజ్జవరపు ఎలీషా, సీహెచ్ ఆదర్శకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కలపాల వజ్రాలు, మట్టా నాగరాజు, కమ్మ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రామినేని రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో గుండెపోటుకు ఇంజెక్షన్

ఉయ్యూరు: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గుండెపోటు ప్రథమ చికిత్సకు అవసరమైన ఇంజెక్షన్ అందుబాటులో ఉన్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ మురళి తెలిపారు. వైద్యశాల ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛాతీ నొప్పిగా ఉండి గుండెనొప్పని అనుమానం వచ్చిన వెంటనే వైద్యశాలకు వస్తే ఈసీజీ, ఇతర పరీక్షలు చేసి గుండెపోటుగా నిర్ధారణ అయితే ప్రథమ చికిత్సగా ఇంజెక్షన్ చేసి, విజయవాడ గుండె వైద్యుల దగ్గరకు పంపిస్తామన్నారు. మార్కెట్లో ఈ ఇంజెక్షన్ ధర రూ.50 వేలకుపైన ఉంటుందన్నారు. ఉయ్యూరు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్ తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా కృష్ణప్రసాద్

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ ఎంపీడీవో బి.విగ్గిన్స్ ప్రభుత్వం శాఖా పరమైన శిక్షణకు హాజరయ్యేందుకు మూడు నెలల పాటు సెలవు పెట్టారు. దీంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏఓ) కృష్ణప్రసాద్‌ను నియమించారు. మూడు నెలలపాటు పూర్తి అదనపు బాధ్యతలతో విధులు నిర్వహిస్తారు.

పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చాలి

డీపీఓ లావణ్యకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ లావణ్యకుమారి

విజయవాడరూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగు పర్చాలని జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్యకుమారి అన్నారు. బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ రహదారిలో వీఐపీలు రాకపోకలు సాగించే రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో అపరిశుభ్రత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని, యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆ గ్రామాల కార్యదర్శులను ఆదేశించారు. ఆయా గ్రామాల్లో చెత్త డంపింగ్ కేంద్రాలు లేకపోవడం వలన వ్యర్థాలను గుంటూరు జిందాల్‌కు తరలిస్తున్నట్లు కార్యదర్శులు తెలిపారు. వచ్చే ఏప్రిల్‌కు ఐదు గ్రామాల్లో చెత్త తరలించే పనులను ఏజెన్సీలకు ఇవ్వాలనే ఆలోచన ఉందని, అప్పటి వరకు పంచాయతీలు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మిగిలిన గ్రామాల్లో బుడమేరు వరదల్లో మరమ్మతులకు గురైన చెత్త నుంచి సంపద సృష్టించే షెడ్లను బాగుచేయించి వానపాముల ఎరువుల ఉత్పత్తులను ప్రారంభించాలన్నారు. మండలంలో ఇంటి పన్ను వసూళ్ల వేగం పెంచి మార్చి ఆఖరునాటికి నూరు శాతం వసూలు చేయాలన్నారు. మండలంలో మొత్తం రూ.19 కోట్లు వసూలు కావాల్సి ఉండగా సుమారు 14 శాతం మాత్రమే (రూ.కోటి 20 లక్షలు) వసూలు కావడం ఏమటని డీపీఓ ప్రశ్నించారు. ఇంటి పన్ను వసూలు విధానం డిజిటలైజేషన్‌తో సులభతరం చేశామన్నారు. యజమానులు ఇంటి నుంచే ఇంటి పన్ను చెల్లించే అవకాశం ముందని, ప్రభుత్వ ఖాతాలో జమచేయడం వెంటనే జరుగుతుందన్నారు. ప్రజలకు ఈ విషయం తెలియచేయాలన్నారు. డీఎల్‌పీఓ రాఘవన్ మాట్లాడుతూ గ్రామాల్లో నూటికి నూరుశాతం ఇంటి పన్ను వసూలు కావాలని, ప్రత్యేకంగా సిబ్బంది వెళ్లి వసూలు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు కూడా ప్రతి రోజూ ఎక్కడెక్కడ జరుగుతుందో ఫొటోలతో తెలియజేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఎండీపీ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



మొక్కలు నాటుతున్న పవర్ గ్రిడ్ సీనియర్ మేనేజర్ నాగమోహనరావు, హెచ్‌ఎం.జగదీశ్వరరావు

గన్నవరం రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పవర్ గ్రిడ్ సీనియర్ మేనేజర్ కె.నాగమోహనరావు పేర్కొన్నారు. బుధవారం గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిపేరిట మొక్క నాటి రక్షించాలని పిలుపునిచ్చారు. వాతావరణం సమతౌల్యానికి మొక్కలు పెంపకం తప్పని సరి అని చెప్పారు. హెచ్‌ఎం కేఎస్ జగదీశ్వరరావు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు గ్రంథాలయానికి పుస్తకాలు అందజేసిన నాగమోహనరావును అభినందించారు. పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాన్ని అందరు స్వీకరించాలన్నారు. ఉపాధ్యాయులు పి.అనిల్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి



రామవరప్పాడు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

రామవరప్పాడు: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం లేబర్స్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి, లేబర్స్ కోడ్స్‌గా రూపొందించడమంటే చట్టాలను తుంగలో తొక్కటమేనన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కనీసం కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులతో కూడా చర్చించకుండా నిరంకుశ నిర్ణయాలు చేయడం, అమలు చేయడానికి పూనుకోవడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. పనిగంటల పెంపు వెట్టి చాకిరి, బానిస బతుకులకు సంకేతాలన్నారు. పోరాటాలు, బలిదానాల ద్వారా కార్మికులు ఏ హక్కులు, చట్టాలు సాధించుకున్నారో వాటి సాధన, రక్షణ, అమలు కోసం పోరాటం తప్పదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చెందిన వ్యక్తులం.. మమ్మల్నే అడ్డుకుంటారా?

జాతీయ రహదారిపై బైఠాయించిన వరిగడ్డి ట్రాక్టర్ డ్రైవర్లు



జాతీయ రహదారిపై కూర్చున్న ట్రాక్టర్ డ్రైవర్లు

గన్నవరం: ట్రాఫిక్ పోలీసులపై వరిగడ్డి ట్రాక్టర్లు నడిపే వ్యక్తులు గొడవకు దిగిన సంఘటన స్థానిక సినిమా హాలు సెంటర్‌లో బుధవారం చోటు చేసుకుంది. వివరాలీలా ఉన్నాయి. గన్నవరం శివారు మర్లపాలెం వ్యక్తులకు చెందిన మూడు ట్రాక్టర్లు వరిగడ్డి లోడుతో స్థానిక సినిమా హాలు సెంటర్ మీదుగా బయలుదేరాయి. అయితే ఉదయం జాతీమ రహదారిపై రద్దీ సమయంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న గడ్డి ట్రాక్టర్లను ట్రాఫిక్ పోలీసులు అడ్డుకొని ఫొటోలు తీశారు. దీంతో ఆగ్రహానికి గురైన ట్రాక్టర్లు నడిపే వ్యక్తులు సదరు ట్రాఫిక్ పోలీసులపై గొడవకు దిగారు. స్థానిక ఎమ్మెల్యేకు చెందిన వ్యక్తులమైన తమ ట్రాక్టర్లనే అడ్డుకుంటారా, సాయంత్రంలోపు మీ ఉద్యోగాలను తీయించి వేస్తామని బెదిరింపులకు సైతం దిగారు. ట్రాఫిక్ పోలీసులు కూడా గట్టిగా సమాధానం ఇవ్వడంతో సదరు వ్యక్తులు జాతీయ రహదారిపై బైఠయించి రాస్తారోకోకు దిగారు. దీంతో విజయవాడ–ఏలూరు రూట్‌లో కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభించిపోయింది. స్థానికులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

రీ సర్వేపై ముందస్తు సమాచారం ఇవ్వాలి

ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్



రీసర్వేపై వివరాలు సేకరిస్తున్న ఆర్డీఓ హేలా షారోన్

కంకిపాడు: రైతులల సంతృప్తే లక్ష్యమని ఉయ్యూరు ఆర్డీఓ హేలా షారోన్ అన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో చేపట్టిన భూముల రీసర్వేను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా షారోన్ మాట్లాడుతూ.. రీసర్వేపై ప్రతిఒక్క రైతుకు ముందస్తు సమాచారం అందించాలని తెలిపారు. సర్వే విషయంలో రైతులు సంతృప్తి చెందే వరకు సర్వే ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియ సమర్థవంతంగా, పారదర్శకంగా సాగాలని చెప్పారు. ఎలాంటి లోటుపాట్లకు అవకాశం ఇవ్వకుండా సర్వే సిబ్బంది బాధ్యతయుతంగా పనిచేయాలని షారోన్ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భవనారాయణ, సర్వేయర్ భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.